అంగన్‌వాడీల్లో సమస్యల తిష్ట!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు

- అధిక శాతం అద్దె భవనాల్లోనే నిర్వహణ
- మరోవైపు టీచర్లు, హెల్పర్లకు అందని వేతనాలు
- కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా రానీ వైనం
- పిల్లలు, గర్భిణులకు తప్పని ఇక్కట్లు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఓవైపు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేక అల్లాడుతుంటే, మరోవైపు అధిక శాతం సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇంకోవైపు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలకు నెలనెలా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడూ కూరగాయలు, గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్‌లో ఉండడంతో అప్పులు తెచ్చి కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 212 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవిగాకుండా దాతలు ఇచ్చిన మరో 138 భవనాల్లో కొన్ని కొనసాగుతుండగా, మిగిలిన 443 కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 సెంటర్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాలకు 143 కేంద్రాలు, మేడ్చల్‌లో 211 కేంద్రాలకు 23 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి 6 నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో యాజమానుల నుంచి ఒత్తిడి భరించలేకపోతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

793 కేంద్రాల్లో 1.07 లక్షల లబ్ధిదారులు

◆ జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 90,361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది మొత్తం 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ పరిధిలోని 311 కేంద్రాల్లో 47,028 మంది, మేడ్చల్‌లోని 211 కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

117 కేంద్రాల్లో నీటి కట..కట

◆ జిల్లాలోని 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో అత్యధికంగా 77 కేంద్రాలు, అల్వాల్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

మరుగుదొడ్లు అంతంతే..

◆ జిల్లాలోని 118 అంగన్‌వాడీ కేంద్రాలోలే కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో 78, అల్వాల్ పరిధిలో 51, కుత్బుల్లాపూర్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ స్టాండర్డ్ టైల్స్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మల్లాపూర్ ఏఈ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు మల్లాపూర్ పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



ఉప్పల్: మున్సిపల్ కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి 116 మంది లబ్ధిదారులకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీనిచ్చిన డబ్బులతో పాటు తులం బంగారం కూడా ఇచ్చి మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెనోఖర్, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, చేతన హరీశ్, బండారు శ్రీవాణీ వెంకట్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ డ్రైవ్‌పై మేడ్చల్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్క్రీనింగ్ శాతం మరింత పెంచాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లుకు సూచించారు. అలాగే ప్రతిరోజూ ఫార్మట్ రూపంలో నివేదికను అందించాలని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు.

ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

కాప్రా: విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం వరిస్తుందని హైకోర్టు న్యాయవాది బాలకృష్ణ అన్నారు. విజయ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు శనివారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ రాజేశ్వర్, ప్రిన్సిపాల్ వెంగబాబు, కో-ఆర్డినేటర్ బండి శివరంజని పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను పరిష్కార వేదిక

అల్వాల్: అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆస్తి పన్ను పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రాపర్టీ ట్యాక్స్‌పై ఏమైనా ఇబ్బందులు ఉంటే మార్చి 2,9,16,23,30 తేదీల్లో కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ స్వామి, నారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విస్తృతోపన్యాసాల కార్యక్రమం

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ, బోటానీ, కెమిస్ట్రీ విద్యార్థులకు వివిధ యూనివర్సిటీల నుండి వచ్చిన ప్రొఫెసర్లు శనివారం విస్తృతోపన్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండి రాజు మాట్లాడుతూ.. విద్యార్థుల అదనపు జ్ఞాన సముపార్జనకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జీఎస్.జగన్, దత్తా సకోలే, పి.అడవి రాజు, విష్ణు, స్వాతి, లలిత, అర్చన, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఉప్పల్: ఉప్పల్ జీహెచ్ఎంసీ అధికారులు పోలీస్ బందోబస్తు మధ్య ఫుట్‌పాత్ ఆక్రమణలను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా డీసీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తే సహించేది లేదని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తొలగిస్తామన్నారు.

వివాహిత అదృశ్యం

అల్వాల్: వివాహిత అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌కు చెందిన ఉగ్గాని రజిత కుమార్తె స్రవంతి అలియాస్ మానస (25)కు 2017 సంవత్సరంలో రాజు అనే వ్యక్తితో వివాహం కాగా మంచిర్యాలలో ఉంటుంది. అయితే భర్తతో గొడవల వల్ల 2024 సెప్టెంబర్‌లో వినాయక్‌నగర్‌లోని తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. ఈనెల 4న తల్లి పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి స్రవంతి కనిపించలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారులతో గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ నుంచి టెక్నికల్ ఇష్యూ లెటర్‌ను రైల్వేకు జారీ చేయాలని అధికారులకు సూచించారు. గౌతంనగర్ చౌరస్తా నుంచి సాయినగర్ చౌరస్తా వరకు ప్రజలకు సంబంధించిన ఎలాంటి ప్రాపర్టీ డ్యామేజ్ కాకుండా నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ ఈఈ రోహిణి, రేణుక, డీఈ సుదర్శన్, ఏఈ ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, మేకల రాముయాదవ్, అమీనుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీ ముదిరాజ్, సుమన్‌గౌడ్, భాగ్యనందరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసులకు జాతీయ అవార్డు

రామంతాపూర్ : జేఎస్‌పీఎస్ ప్రభుత్వ హోమియో మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ గడుగు శ్రీనివాసులు హోమియో వైద్యానికి చేసిన సేవలకు గాను జీఎల్ఎన్ శాస్త్రి స్మారక జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు పూణెలో శనివారం నిర్వహించిన 27వ జాతీయ ఇండియన్ హోమియోపతి రెండు రోజుల సదస్సులో మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ మిలింద్ నికుబ్ అవార్డును ప్రదానం చేశారు. డాక్టర్ శ్రీనివాసులు 34 ఏళ్లుగా హోమియో వైద్యం, విద్య పరిశోధనలు, వివిధ వ్యాధుల చికిత్సతో పాటు మెదడువాపు వ్యాధి నివారణలో హోమియో మందుల పాత్ర కీలకమైనదని తన పరిశోధనల ద్వారా నిరూపించారు. గతంలో శ్రీనివాసులకు ఉత్తమ వైద్య ప్రొఫెసర్‌గా సీఎం అవార్డు కూడా వరించింది.

అడ్మిషన్లు చేపడుతున్న కాలేజీపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అల్వాల్: నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీచైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలిఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. తిరుమలగిరి సుభాష్‌నగర్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద గల అనధికారిక శ్రీచైతన్య కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తుండడంతో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025-26 విద్యా సంవత్సర నోటిఫికేషన్ విడుదల కాకముందే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడం సరికాదన్నారు. ఇంటర్ బోర్డు తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను ఆపాలని కోరారు. కార్యక్రమంలో సల్మాన్ బేగ్, సత్యప్రసాద్, శ్రీకాంత్, మాజీద్ అలీఖాన్, కల్యాణ్, నరేశ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



మల్కాజిగిరి: అనారోగ్యంతో రైల్వే ట్రైనీ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గణేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్‌కు చెందిన రమేశ్‌బాబు (40) మౌలాలిలోని రైల్వే ట్రైనింగ్ సెంటర్‌లో ట్రైనింగ్ కోసం 14 రోజుల క్రితం వచ్చాడు. ఈనెల 22న మధ్యాహ్నం కస్తూరిబానగర్ వద్ద పడి ఉన్నాడు. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకోగా పోలీసుల సహాయంతో ప్రిన్సిపాల్ ప్రతనేష్ కాకడే లాలాగూడలోని రైల్వే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలు షురూ

బోడుప్పల్: బోడుప్పల్‌లోని భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు స్వామివారికి అభిషేకం, 11 గంటలకు పుట్టు కమ్ముట, సాయంత్రం 5 గంటలకు గంగ తెప్పోత్సవం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు తెలిపారు.

ఆర్టీసీ అభ్యున్నతికి మరింత కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

బోడుప్పల్: ఆర్టీసీ అభ్యున్నతికి ఉద్యోగులు మరింత కృషి చేయాలని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రాజశేఖర్ అన్నారు. చెంగిచర్ల డిపోలో కండక్టర్, డ్రైవర్లకు నిర్వహిస్తున్న పవర్ శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. శిక్షణ తరగతుల ఆవశ్యకత, టీం వర్క్ ప్రాధాన్యతను వారికి వివరించారు. ప్రయాణికులతో ఎలా నడుచుకోవాలి, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భీంరెడ్డి, చౌహాన్, చెంగిచర్ల డీఎం కవిత, అసిస్టెంట్ మేనేజర్లు చంద్రమౌళి, సాయి సుబ్రమణ్యం, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

అల్వాల్‌లో కోడిగుడ్లు, చికెన్ మేళా

అల్వాల్: అల్వాల్ ఇందిరావిగ్రహం వద్ద ఆల్వాల్ చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ వెంకటేశ్వర హేచరీస్ ఆధ్వర్యంలో శనివారం చికెన్, ఎగ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లోనే బర్డ్‌ఫ్లూ ఉందని, ప్రజలు వదంతులను నమ్మవద్దని కోరారు. కార్యక్రమలో సుదర్శన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీ వాగ్దేవి సమితి వారి వీణ విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్బలక్ష్మి, సత్యమణి, నెల్లుట్ల ఆండాళ్, శ్రవణ్ కుమార్, వడ్లమాని సుధా, జ్యోతి తులసీ, వంగిపురం విద్యారాణి, బొమ్మకంటి అశ్విన్ కుమార్ వీణపై మాతేయ్ మలయధ్వజ, మహాగణపతిమ్, సరస్వతి నమోస్తుతే, ఉపచారము భైరవ రూపక తాళం, ఎందరో మహానుభావులు, నిధిచాల సుఖమా లాంటి కీర్తనలను వీణపై పలికించారు.

కొనసాగుతున్న స్వచ్ఛత స్పెషల్ డ్రైవ్



ప్రదర్శనలతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కుషాయిగూడ: డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ) ఆదేశాల మేరకు కుషాయిగూడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో చేపట్టిన స్వచ్ఛత స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగుతోంది. ఈనెల 16న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ ప్రారంభించగా 28 వరకు కొనసాగనున్నది. ఇందులో భాగంగా శనివారం గ్రీన్ ఎన్వీరాన్‌మెంట్‌పై వర్క్‌షాప్, మెడికల్ క్యాంపులతో పాటు విద్యార్థులు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం



రామంతాపూర్ : ఢిల్లీ సీఎంగా వైశ్య సామాజిక వర్గానికి చెందిన రేఖాగుప్తాను నియమించడంపై ఆ సంఘం నాయకులు రామంతాపూర్ ప్రధాన రహదారిలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్న తమ సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిస్తూ ప్రధానమంత్రి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంబు పాండయ్య, శ్రీనివాస్ గుప్తా, నగేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని శంకర విద్యా పీఠం(కనకరాజుతోట) సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవ సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన అరుణ, పద్మ గాత్ర కచేరి సంగీతాభిమానులను ఆకట్టుకున్నది.

నేడు ఉంచవృత్తి, పంచరత్న సేవ..

ఆదివారం ఉదయం 7 గంటలకు ఉంచవృత్తి, 10 గంటలకు జంటనగరాలకు చెందిన వివిధ కళాకారులతో పంచరత్నసేవ, రాత్రి 7 గంటలకు తిరుపతికి చెందిన డాక్టర్ ఎం.వి.సింహాచలశాస్త్రిచే హరికథతో ముగుస్తుందని నిర్వాహకుడు ఘంటసాల సత్యసాయి తెలిపారు.

టిప్పర్ టైరు పగిలి చెలరేగిన మంటలు

మేడిపల్లి: టిప్పర్ టైర్‌పగిలి మంటలు చెలరేగిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం కాచవానిసింగారం గ్రామంలోని తిరుమల రాక్‌స్యాండ్ మానిప్యాక్చరింగ్ యూనిట్ నందారెడ్డికి చెందిన టిప్పర్ టైరు పగిలిపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వాహనం కాలిపోయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడతో వారు ఘటనా స్థలానికి చేరుకున్న మంటలను అదుపు చేశారు. వాహనం అప్పటికే మంటల్లో పూర్తిగా కాలిపోయింది.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని ఇస్కాన్ సంస్థ వ్యక్త హృషికేశ దాస్ ప్రభూజీ అన్నారు. నాచారం మహంకాళి సహిత మహాకాళేశ్వర ఆలయంలో బీజేపీ నేత ప్రకాశ్, ఇస్కాన్ సభ్యు రాలు విద్యులతా ఆధ్వర్యంలో భగవద్గీత, నిత్య జీవితం, మానవ జీవితంలోని సంఘర్షణలు, పరిష్కారాలు వంటి విషయాలపై ప్రవచనాలను శనివారం వినిపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ పోగుల వెంకట రమణారెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, అనితారెడ్డి, నాచారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మగళ్ల నవీన్ కుమార్ పాల్గొన్నారు.



ప్రవచనాలు సత్కారిస్తున్న దృశ్యం

నేటి నుంచి రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని సీతారామ చంద్రస్వామి దేవస్థానం రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈనెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్, అర్చకులు శనివారం తెలిపారు. శ్రీత్రిదండి చిన్న రామానుజ జీయర్‌స్వామి కరకమలంల చేత ప్రాణప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ప్రభుత్వ ఉద్యోగి మృతి



నక్క సందీప్ (ఫైల్)

మేడిపల్లి: ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన నక్క సందీప్ (32) మేడిపల్లి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పీర్జాదిగూడలో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై నిత్యావసర సరుకుల కోసం వెళ్తున్నాడు. స్థానికంగా ఉన్న రిలయన్స్ సూపర్ మార్కెట్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న షట్టర్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కుమారుడు ఉన్నారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



సంజన(ఫైల్)

ఉప్పల్: కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని నిక్కొండ ప్రాంతానికి చెందిన నీలా చిలుకానగర్‌లో నివాసముంటూ హోటల్‌లో పని చేస్తూ జీవనోపాధి పొందుతోంది. నీలా కుమార్తె బట్టు సంజన (15) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కడుపునొప్పి తీవ్రంగా ఉండడంతో శనివారం స్కూల్‌కు వెళ్లలేదు. తల్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయక పోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

'స్వచ్ఛతా హీ సేవా' ప్రారంభం



రామంతాపూర్ : చిలుకానగర్ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ యూనివర్సిటీ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ క్యాంపస్ విద్యార్థులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ నగర్‌లోని పరిసర ప్రాంతాలను విద్యార్థులతో కలిసి శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రంజిత్, ప్రొఫెసర్ రాజు నాయక్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు

హబ్సిగూడ: రాంరెడ్డినగరలోని నల్లపోచమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీశ్, రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సత్కారం

గౌతంనగర్: ఆనంద్‌భాగ్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులు మోర శ్రీకాంత్ ముదిరాజ్, నిజాంపురం శోభన్ ముదిరాజ్‌ను నేరేడ్‌మెట్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. బళ్లారి అశోక్, తుపాకుల జనార్ధన్, శ్రీశైలం, బాలనర్సింహా, రవిశంకర్, భాస్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద పెళ్లి జంటకు పుస్తె మట్టెలు అందజేత



ఉప్పల్: అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల్ శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో ఉప్పల్ బీరప్పగడ్డకు చెందిన శ్రీవాణి వివాహం కోసం పుస్తె, మట్టెలు, చీర, గాజులను గడ్డిఅన్నారం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రఘుపతి రెడ్డితో కలిసి శనివారం అందజేశారు. తన ఫౌండేషన్ దాకవనా కుల మతాలకు అతీతంగా సేవ చేస్తున్నట్లు శ్రీనివాస్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల స్వప్న తదితరులు పాల్గొన్నారు.